సాక్షి
అనకాపల్లి
శనివారం । 14 । అక్టోబర్ । 2023



ప్రకృతి వనం సందర్శన

విశాఖ: జీవవైవిధ్య ఉద్యానవనాన్ని విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. అక్కడి విశేషాలను నిర్వాహకులు వారికి వివరించారు.



ఘనంగా 'నా దేశం-నా మట్టి'

విశాఖ: నా దేశం-నా మట్టి కార్యక్రమంలో భాగంగా వీసీ ప్రసాదరెడ్డి వర్సిటీ నుంచి సేకరించిన మట్టిని అమృత కలశంలో వేశారు.

ఉష్ణోగ్రతలు

అనకాపల్లిటౌన్: రాగల ఐదురోజులు ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న 35, 15న 34.8, 16న 34.5, 17న 34.2, 18న 34.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

16న సీఎం జగన్ రాక



- విశాఖలో ఇన్ఫోసిస్, పరవాడలో యుజియా ఫార్మా, లారస్ ల్యాబ్‌లకు శ్రీకారం

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 16న విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించనున్నారు. రుషికొండలో ఇన్ఫోసిస్ ఐటీ కంపెనీని ప్రారంభిస్తారు. అనంతరం పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో అరబిందో యాజమాన్యం నిర్మించిన యుజియా పరిశ్రమను ప్రారంభించి, లారస్ ల్యాబ్ యాజమాన్యం తలపెట్టిన కొత్త పరిశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. ఈ మేరకు శుక్రవారం పర్యటన షెడ్యూల్ ఖరారు చేశారు. 16వ తేదీ ఉదయం 10.20 గంటలకు సీఎం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.40 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నెం.3 వద్దకు వస్తారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన ఐటీ హిల్ నెం.2కు చేరుకుని ఇన్ఫోసిస్ ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాల్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం ఇన్ఫోసిస్, వివిధ ఐటీ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి కాసేపు సంభాషించనున్నారు. అక్కడ ప్రసంగించిన అనంతరం 11.55 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ జీవీఎంసీ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ మిషన్ ప్రారంభిస్తారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.15 గంటలకు పరవాడ చేరుకుంటారు. పది నిమిషాల పాటు ప్రజాప్రతినిధులతో ఇంటరాక్ట్ అవుతారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో గల యుజియా స్టెరైల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అచ్యుతాపురం సెజ్‌లో హెలిప్యాడ్ వద్దకు చేరుకుని.. అక్కడ మధ్యాహ్నం 1.30 నుంచి 1.45 వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. అక్కడి నుంచి లారస్ ల్యాబ్‌కు చేరుకుని యూనిట్-2ను ప్రారంభిస్తారు. పరిశ్రమను సందర్శించి, కంపెనీ సీఈవో, డైరెక్టర్లు, ఉద్యోగులతో ఇంటరాక్ట్ అవుతారు. అనంతరం 2.35 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 3.10 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు వస్తారు. అక్కడ నుంచి 3.20 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగు పయనమవుతారు.

హెలిప్యాడ్ పరిశీలన

సీఎం పర్యటన నేపథ్యంలో ఫార్మాసిటీలో ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ స్థలాన్ని అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవో చిన్నికృష్ణ, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం పరిశీలించారు. వారి వెంట జేసీ జాహ్నవి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్, రాంకీ ఎండీ లాల్‌కృష్ణ, తదితరులు ఉన్నారు.



యుజియా పరిశ్రమను సందర్శిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజలతో మమేకమయ్యేలా..

- 26 నుంచి ఉత్తరాంధ్రలో సామాజిక బస్సు యాత్ర
- ఉత్తరాంధ్ర మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులతో వైవీ సుబ్బారెడ్డి, బొత్స సమీక్ష

సాక్షి, విశాఖపట్నం: రానున్న ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ వ్యూహరచన చేస్తోంది. దీనిలో భాగంగా బస్సు యాత్రకు ముహూర్తం ఫిక్స్ చేసింది. సామాజిక బస్సు యాత్ర పేరిట రాష్ట్రమంతా పర్యటించాలని ప్రణాళిక రూపొందించారు. ఈ బస్సు యాత్రను ఉత్తరాంధ్ర నుంచి ప్రారంభించాలని పార్టీ నేతలు నిర్ణయించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణల ఆధ్వర్యంలో శుక్రవారం ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ యాత్రలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన విషయంతో పాటు.. జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.



పార్టీ ముఖ్యులతో సమావేశమైన వైవీ సుబ్బారెడ్డి..చిత్రంలో డిప్యూటీ సీఎంలు బూడి, పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్

మహిళలకు, దళితులకు, వెనబడిన వర్గాల వారికి సీఎం వైఎస్ జగన్ చేసిన మేలు.. వెనుకబడిన వర్గాలకు ప్రధాన పదవులు కేటాయించిన విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తే భవిష్యత్తులో మరింత సువర్ణపాలన రానుందని ప్రజలకు వివరించాలన్నారు. ఈ రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ నాయకత్వం ఎంత అవసరమో ఈ బస్సు యాత్ర ద్వారా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు ధర్మాన కృష్ణదాసు, పాలవలస విక్రాంత్, మజ్జి శ్రీనివాస్, కోలా గురువులు, బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాండవ జలాశయంలో చేప పిల్లల విడుదల



తాండవ రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడుదల చేస్తున్న నాయకులు, మత్స్యశాఖ అధికారులు

గొలుగొండ: మత్స్యకారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తెలిపారు. పొగచెట్లపాలెం గ్రామం వద్ద తాండవ జలాశయంలో శుక్రవారం 8.39 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తాండవ జలాశయం పరిధిలో సుమారుగా 190 మంది మత్స్యకారులు చేపలు, రొయ్యల వేటపై జీవనం సాగిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీలు సుర్ల బాబ్జీ, జక్కు నాగమణి, సర్పంచ్ పెదిరెడ్ల లక్ష్మి, మత్స్యశాఖ ఏడీ షేక్ జాస్మిన్, డివిజన్ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సుస్థిర సేవలు అందేలా ఏసీబీ కృషి

దొండపర్తి: ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన సేవలలో అవినీతికి ఆస్కారం లేకుండా సుస్థిరమైన ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరే విధంగా అవినీతి నిరోధక శాఖ నిరంతరం కృషి చేయాలని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం అవినీతి నిరోధక శాఖ విశాఖ రేంజ్(విశాఖ, అనకాపల్లి, అల్లూరి)కు చెందిన అధికారులతో డీజీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవినీతి రహిత పాలన అందేలా చూడాల్సిన బాధ్యత ఏసీబీపై ఉందని స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా ఏసీబీ 14400 కాల్ సెంటర్, ఏసీబీ కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదులపై సకాలంలో స్పందించి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి నిర్మూలనే లక్ష్యంగా నిరంతర నిఘాలో భాగంగా ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన అధికారులను గుర్తించడం, నిరంతర తనిఖీలు, ఆకస్మిక తనిఖీలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై ప్రజల నుంచి వస్తున్న ఆరోపణలపై విచారణ, సంబంధిత అధికారులను గుర్తించడం వంటి చర్యలను చేపట్టాలన్నారు. పెండింగ్ కేసులలో దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. అదే విధంగా అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన నిందితుల నేరాన్ని న్యాయస్థానంలో పూర్తి సాక్ష్యాధారాలతో నిరూపించి సకాలంలో నిందితులకు శిక్ష పడేలా చూడాలని సూచించారు.

చట్టాలపై అవగాహనతో మహిళలకు రక్షణ

నర్సీపట్నం: మహిళల రక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని జిల్లా పోలీసు మహిళా రక్షణ ఇన్‌చార్జి విజయ తెలిపారు. జిల్లా పోలీసుశాఖ తరఫున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళా రక్షణ చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణకు పోలీసుశాఖ పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన దిశ చట్టంపై విద్యార్థినులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి బాలిక మొబైల్ ఫోన్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో యాప్ రక్షణ కవచంలా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డా.ఎస్.రాజు మాట్లాడుతూ మహిళల రక్షణకు అమల్లో ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టంపై విద్యార్థినులకు డిజిటల్ స్క్రీన్‌పై అవగాహన కల్పించారు.



డిజిటల్ స్క్రీన్‌పై మహిళా రక్షణ చట్టాలను వివరిస్తున్న అధికారులు

సత్యదేవుని ముత్తంగి సేవకు శారదా పీఠాధిపతులకు ఆహ్వానం

సింహాచలం: అన్నవరం వీర వేంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో త్వరలో ప్రారంభించనున్న ముత్తంగి సేవకు హాజరు కావాలని కోరుతూ చినముషిడివాడలోని శారదా పీఠాధిపతులకు ఆహ్వానం అందింది. ఈ మేరకు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతికి ముత్యాల ఆభరణాలను శుక్రవారం అన్నవరం దేవస్థానం అధికారులు, వేద పండితులు చూపించారు. ఈ నెల 16న ముత్యాల ఆభరణాలను అలంకరించి ఈ సేవను ప్రారంభించనున్నారు. 3 కిలోల బరువైన ముత్యాలు, మణులు, నవరత్నాలను ఆభరణాల తయారీ కోసం వినియోగించారు.

అంతర్జాతీయ వేదికపై మెరిసిన క్రీడా 'జ్యోతి'

- నేపాల్‌లో సత్తా చాటిన ఉపాధ్యాయిని నాగజ్యోతి
- రన్నింగ్, పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణం, జావలిన్ త్రో, డిస్కస్ త్రోలో వెండి పతకాలు



పతకాలు స్వీకరిస్తున్న నాగజ్యోతి



నాగజ్యోతి పవర్‌లిఫ్టింగ్



నాగజ్యోతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రావికమతం/రోలుగుంట: రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించిన ఉపాధ్యాయిని పి.వి.ఎం.నాగజ్యోతి అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించి, భారత పతాకాన్ని రెపరెపలాడించారు. సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ (ఎస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నేపాల్ దేశంలో జరిగిన 8వ అంతర్జాతీయ క్రీడా పోటీల్లో నాలుగు పతకాలు సాధించారు. 100 మీటర్ల పరుగు పందెం, పవర్‌లిఫ్టింగ్ పోటీలో బంగారు పతకాలు, డిస్కస్ త్రో, జావలిన్ త్రోలో వెండి పతకాలను గెలుచుకున్నారు. ఇంతటి ప్రతిభ చూపి శుక్రవారం స్వదేశానికి, స్వగ్రామానికి వచ్చిన ఆమెకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన నాగజ్యోతి ప్రస్తుతం రోలుగుంట హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. బోధనతోపాటు క్రీడల్లోనూ మక్కువ చూపిస్తున్న ఆమె గతంలో ఏపీ స్టేట్ పవర్‌లిఫ్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర పోటీల్లో విజేతగా నిలిచారు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన 29వ ఇండియన్ నేషనల్స్ బెంచి ప్రెస్ అండ్ డెడ్‌లిఫ్ట్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు పొందారు. పవర్‌లిఫ్టింగ్‌లో ఆసియా కప్ బంగారు పతక విజేత ఎం.భాస్కరరావు వద్ద ఆమె శిక్షణ పొందారు. పతకాలు గెలుచుకొని వచ్చిన నాగజ్యోతిని సహచర ఉపాధ్యాయులు రోలుగుంటలో సన్మానించారు. హెచ్‌ఎం వరప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.వి.ఎస్.ఆర్.శర్మ, శ్రీరామ్మూర్తి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న పరిశ్రమల కేంద్రం జీఎం గణపతి



కార్యక్రమంలో పాల్గొన్న పారిశ్రామిక వేత్తలు

అక్కిరెడ్డిపాలెం: మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ), రాష్ట్ర పరిశ్రమల మంత్రిత్వ శాఖ అందిస్తున్న పథకాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతి కోరారు. ఆటోనగర్‌లోని వాసీవా భవనంలో శుక్రవారం వ్యవస్థాపకత అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జీఎం గణపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక అభివృద్ధి విధానం 2023- 27ను వివరించారు. ఏపీ చాంబర్స్ ఉపాధ్యక్షుడు కె.వి.ఎస్.ఎ.వర్మ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ, పరిశ్రమల శాఖ కల్పిస్తున్న అవకాశాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలన్నారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండు రంగప్రసాద్ మాట్లాడుతూ సీనియర్ పారిశ్రామికవేత్తల నుంచి సలహాలు, సూచనలు పొందేందుకు వాసీవా వేదికగా చేసుకోవాలని సూచించారు.

అనంతరం ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర పరిశ్రమల శాఖ అందిస్తున్న పథకాలు, టీసీ, ఎస్ఎస్ఐసీ, కేవీఐసీ, ఎస్ఐడీబీఐ తదితర అంశాలను వివరించారు. ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి, లీడ్ జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాస్, ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ డిప్యూటీ జనరల్ మేనేజర్, అచ్యుతాపురం జి.ప్రసాద్‌రెడ్డి, కేవీఐసీ నోడల్ ఆఫీసర్ డి.సుబ్రహ్మణ్యం, ఎస్ఎస్ఐడీ మేనేజర్ టి.కమలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

26 నుంచి బాలల దినోత్సవ పోటీలు



బాలల దినోత్సవ పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లిటౌన్: బాలల దినోత్సవ కార్యక్రమాలను ఈ నెల 26 నుంచి నవంబర్ 14 వరకూ నిర్వహించనున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ తెలిపారు. స్థానిక డీఈవో కార్యాలయంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ చేతుల మీదుగా బాలల దినోత్సవ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ 26న చిత్రలేఖనం, 27న దేశభక్తి పాటలు, 28న పద్యపఠనం, 29న క్విజ్, నవంబర్ 1న కాగితంతో కళాకృతులపై పోటీలు నిర్వహిస్తామన్నారు. 13న స్క్రూటినీ జరిపి, 14న వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన బాలలకు పురస్కారాలను అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా కార్యదర్శులు సీహెచ్ పెద్దినాయుడు, కాండ్రేగుల జనార్దన రావు, మండల అధ్యక్షుడు జి.శ్రీను, కార్యదర్శి పి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టు ప్రకాశరావుకు ప్రశంసాపత్రం



ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ప్రశంసాపత్రం అందుకుంటున్న ఫార్మసిస్టు రత్నాల ప్రకాశరావు

అనకాపల్లి రూరల్: కోవిడ్ సమయంలో ఉత్తమ సేవలందించిన ఫార్మసిస్టులను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి సత్కరించింది. సత్కారం పొందిన వారిలో మండలంలోని బీఆర్టీ కాలనీ శక్తి మెడికల్స్ ఫార్మసిస్టు రత్నాల ప్రకాశరావు ఉన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఫార్మసీ కౌన్సిల్ అధికారుల చేతుల మీదుగా గుంటూరు జింఖానా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించినట్లు శుక్రవారం స్థానిక మీడియాకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రశంస పొందిన ఫార్మసిస్టు ప్రకాశరావును స్థానిక ఫార్మసిస్టులు, పలువురు మెడికల్ షాపుల యజమానులు, కాలనీ పెద్దలు అభినందించారు.

జాబ్‌మేళాలో 134 మంది ఎంపిక



నియామక పత్రాలు అందజేస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారులు, సంస్థ ప్రతినిధులు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్(ఏపీ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 134 మంది ఎంపికయ్యారు. హనీ గ్రూప్, ఫ్లిప్‌కార్ట్, శ్రీరామ్ జనరల్ ఇన్స్యూరెన్స్, వరుణ్ మోటార్స్, హెటిరో లాబ్స్, జయభేరి ఆటోమోటివ్, గేమ్స్ సాఫ్ట్, రక్షిత్ బిజినెస్ సర్వీసెస్, ఎంఎఎస్ మెరైన్ సర్వీసెస్, ఆస్ట్రోటెక్ స్టీల్స్ ప్రైవేటు లిమిటెడ్ తదితర కంపెనీల్లో 416 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు చేపట్టారు. 327 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. 134 మంది అభ్యర్థులను ఆయా కంపెనీలు ఎంపిక చేసుకున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), పి.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు వీరి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు.

గుడ్లు తేలేస్తున్న కోళ్లు

- ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఉష్ణతాపం
- వేసవిని తలపించే వాతావరణమే కారణం
- 25 శాతం మేర పడిపోయిన గుడ్ల ఉత్పత్తి
- 10 శాతానికి పెరిగిన మరణాల రేటు
- నష్టాల పాలవుతున్నామంటున్న పౌల్ట్రీ యజమానులు
- ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని ఆవేదన

సాక్షి, విశాఖపట్నం: వేసవిని తలపించే ఉష్ణతాపం కోళ్ల పరిశ్రమను విలవిల్లాడిస్తోంది. వర్షాలతో చల్లని వాతావరణం ఉండాల్సిన తరుణంలో ఎండ తీవ్రత పౌల్ట్రీ పరిశ్రమను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సాధారణంగా వేసవి మూడు నెలలు మినహా మిగతా నెలలన్నీ కోళ్లకు అనుకూల వాతావరణమే ఉంటుంది. కానీ ఈ సంవత్సరం పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. వేసవి ముగిసి మూడు నెలలైనా ఇంకా ఎండలు మండిపోతూనే ఉన్నాయి. సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల వరకు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భానుడి భగభగల ధాటికి ఫారాల్లో ఉన్న కోళ్ల గుడ్లు తేలేస్తున్నాయి. వర్షాకాలంలో ఫారాల్లో కోళ్ల మరణాలు 1-2 శాతం కూడా ఉండవు. కానీ కొన్నాళ్లుగా కాస్తున్న ఎండలకు మండు వేసవిలో మాదిరిగా 8-10 శాతం కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అంతేకాదు గుడ్ల ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గిపోతోంది. అధిక ఉష్ణోగ్రతలతో 25 శాతం మేర గుడ్ల ఉత్పత్తి క్షీణించిందని పౌల్ట్రీ యజమానులు అంటున్నారు.

ఎండల తీవ్రతకు కోళ్లు ఎక్కువగా నీళ్లు తాగడం, మేత తక్కువగా తినడం వల్ల గుడ్ల ఉత్పత్తి పడిపోతోందని వీరు చెబుతున్నారు. మరోవైపు బ్రాయిలర్ కోళ్లదీ అదే పరిస్థితి. ఇవి కూడా ఎండల తీవ్రతను తట్టుకోలేక చనిపోతున్నాయి. అసలే దేశంలో కోళ్ల మేత ధరలు భారంగా మారిన తరుణంలో ఉష్ణ వాతావరణం కొనసాగుతుండడం తమను నష్టాల పాల్జేస్తోందని వీరు ఆవేదన చెందుతున్నారు. కోళ్లు వేసవి ధాటిని తట్టుకోవడానికి పౌల్ట్రీ యజమానులు ఫారాల్లో స్ప్రింక్లర్ల ద్వారా నీటిని స్ప్రే చేస్తున్నారు. దీంతో కోళ్లు కాస్త ఉపశమనం పొందుతాయి. ప్రస్తుతం అక్టోబర్ నెలలోనూ వీరు ఇంకా స్ప్రింక్లర్లనే కొనసాగిస్తున్నారు. వర్షాలు కురవాల్సిన రోజుల్లో ఇలాంటి వేడి వాతావరణ పరిస్థితి గడచిన 30 ఏళ్లలో ఎన్నడూ చూడలేదని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) జాతీయ కౌన్సిల్ సభ్యుడు రామకృష్ణ చౌదరి 'సాక్షి'కి చెప్పారు.



చల్లదనం కోసం కోళ్ల ఫారంలో స్ప్రింక్లర్లతో నీటిని స్ప్రే చేస్తున్న దృశ్యం

పెరుగుతున్న కోడిగుడ్ల ధరలు..

ఉత్తరాంధ్ర జిల్లాలో సుమారు 45 కోడిగుడ్ల (లేయర్) ఫారాలున్నాయి. వీటిలో 50 లక్షలకు పైగా గుడ్లు పెట్టే కోళ్లున్నాయి. అలాగే వివిధ బ్రాయిలర్ ఫారాల్లో రెండు కోట్ల కోళ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడం, ఫారాల్లో కోళ్లు చనిపోవడం వల్ల ఇటు గుడ్లు, అటు చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. నెల రోజులుగా కోడిగుడ్ల ధరలు పెరుగుతూ ఇప్పుడు విశాఖలో వంద గుడ్ల ధర రూ.540కి, కిలో చికెన్ ధర (స్కిన్‌లెస్) రూ.270కి చేరుకుంది. ఇలా వంద గుడ్లపై రూ.50, కిలో చికెన్‌కు రూ.40 చొప్పున పెరిగింది. మరో రెండు మూడు నెలల పాటు గుడ్ల కొరత కొనసాగుతుందని, ఫలితంగా వీటి ధర మరింత పెరిగే అవకాశం ఉందని పౌల్ట్రీ రంగ నిపుణులు చెబుతున్నారు.

దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు


నూకాంబిక అమ్మవారి దసరా నవరాత్రుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఈనెల 15 నుంచి 23 వరకు ప్రశాంత వాతావరణంలో దసరా ఉత్సవాలు నిర్వహించాలని, ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. దసరా నవరాత్రుల మహోత్సవ కరపత్రాలను మిందిలోని తన స్వగృహంలో శుక్రవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూకాంబిక అమ్మవారి ఆలయ పునః నిర్మాణపనులు త్వరితగతిన పూర్తిచేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించాలని కమిటీని ఆదేశించారు. దేవీన వరాత్రుల్లో అమ్మవారి దర్శనానికి, కుంకుమ పూజలు నిర్వహణకు మహిళలు అధికంగా వస్తారని, వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అమ్మవారి ప్రసాదాన్ని ఉచితంగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ధర్మకర్తలు బుద్ద నర్సింగరావు, పీలా లక్ష్మీ శ్రీనివాసరావు, ఆడారి ఉమామహేశ్వరరావు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, కె.రవీంద్రనాథ్, పాము అనూరాధ సన్నిబాబు, కంటపల్లి శోభారాణి వెంకటరావు, మల్లవరపు ఈశ్వరరావు, మనమంద్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జాతీయ బాస్కెట్ బాల్ పోటీలు


పోటీలో తలపడుతున్న బాలికల జట్లు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేంద్ర మంత్రి నారాయణ స్వామి

పీఎంపాలెం/మధురవాడ (భీమిలి): భారతీయ విద్యా కేంద్రం 34వ విద్యా భారతి నేషనల్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు స్థానిక చంద్రంపాలెం హైస్కూల్‌లో శుక్రవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. అండర్ 14 బాలికలు, అండర్ 19 బాలుర విభాగంలో జరిగే ఈ పోటీలను కేంద్ర మంత్రి నారాయణ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ విద్యాకేంద్రం విశాఖ జిల్లా సహకారంతో జరుతున్న పోటీల్లో 19 బాలుర జట్లు, 21 బాలిక జట్లు తలపడుతున్నాయని మంత్రి తెలిపారు. విశాఖ కేంద్రంగా నాలుగు చోట్ల పోటీలు నిర్వహిస్తున్నట్టు పోటీల నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం బాలికల పూల్ ఏలో రాజస్తాన్ క్షేత్ర–ఈస్ట్ యూపీ క్షేత్ర మధ్య పోటీలు జరగగా పూల్ బీ బాలికల విభాగంలో దక్షిణ మధ్య క్షేత్ర–ఉత్తర మధ్య క్షేత్ర జట్ల మధ్య పోటీ జరిగిందని నిర్వాహకులు తెలిపారు. బాలుర విభాగంలో మధ్య క్షేత్ర–రాజస్థాన్ క్షేత్ర జట్లకు సంబంధించి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ ముక్తాబ్ సింగ్ బాద్‌షా, విశాఖ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ టీఆర్‌ఎస్ ప్రసాద్, అధ్యక్షుడు సనీల్ మహంతీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు, జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కేఎస్‌పీ చక్రవర్తి, యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా బొడ్డు శ్రీనివాసరావు



మాడుగుల రూరల్: అనకాపల్లి జిల్లా కాంగ్రెసు కమిటీ(డీసీసీ) అధ్యక్షుడిగా బొడ్డు శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు లేఖ పంపారు. శ్రీనివాసరావు చీడికాడ గ్రామానికి చెందిన వారు. 2019 ఎన్నికలల్లో మాడుగుల నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం ఆయన పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

పీసీసీ జనరల్ సెక్రటరీగా జగతా శ్రీను



పాయకరావుపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెసు కమిటీ జనరల్ సెక్రటరీగా పాయకరావుపేట పట్టణానికి చెందిన జగతా శ్రీనివాస్‌ను ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ నియమించారు. ఈ మేరకు శుక్రవారం లేఖ పంపారు. శ్రీనివాస్ ప్రస్తుతం పీసీసీ కార్యదర్శిగా ఉన్నారు.

ధర్మ రక్షణ ధ్యేయంగా శౌర్యజాగరణ యాత్ర

- మాడుగుల మండలంలో ఘన స్వాగతం


కె.జె.పురంలో రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల: ధర్మం, దేశ సంస్కృతీసంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా శౌర్య జాగరణ రథయాత్రను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అర్చక ఎగ్జామినర్ బంకుబల్లి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కె.జె.పురం గ్రామానికి శుక్రవారం చేరిన ఈ యాత్రకు భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ యువతీ యువకులు చైతన్యవంతులై హిందూ మందిరాలను, మఠాలను రక్షించుకోవడంలో భాగస్వాములవ్వాలన్నారు. ఈ లక్ష్య సాధన కోసమే విశ్వ హిందూ పరిషత్ యువజన విభాగమైన భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కె.జె.పురం గ్రామం నుంచి దబ్బకుంటు రహదారి మాడుగుల, ఎం.కోడూరు, మీదుగా తాటిపర్తి, పాడేరుకు యాత్ర బయలుదేరింది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శ బుద్దా సీతారాము, శౌర్య జాగరణ యాత్ర కన్వీనర్ ఆడారి వెంకట సూర్యప్రకాశ్, భజరంగ్‌దళ్ ప్రముఖ్ నడుపూరి అనిల్‌కుమార్, మహిళా ప్రముఖ్ కాంద్రేగుల అరుణారాణి, విల్లూరి మురళీ, పరమేశ్, సమరతాసేవ ఫౌండేషన్ జిల్లా ప్రచారక్ తవ్వా సన్యాసిశెట్టి, సాలాపు జగన్నాథరావు, బోడ్డేడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నృత్య వైభవం


నవ దేవీ వైభవం నృత్య రూపకం

మద్దిలపాలెం: కూచిపూడి నాట్యాధిపతి డాక్టర్.వెంపటి చిన సత్యం 94వ జయంతి నృత్యోత్సవం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకను విజయనిర్మాణ్ అధినేత సూరపనేని విజయకుమార్, వీఏఏడీఏ వ్యవస్థాపక కార్యదర్శి కన్నం వెంకట రమణారావు, కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ హరిరామమూర్తి, శుభలు ప్రారంభించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి కళాక్షేత్రం పూర్వ విద్యార్థిని లక్ష్మీ ప్రసూన్న నుట్టి నృత్య పరికల్పనలో నవ దేవి వైభవం నృత్య రూపకం అద్భుతంగా ప్రదర్శించారు. అనంతరం వీవీఎస్ జగన్నాథరావు శిష్య బృందం కూచిపూడి నృత్యప్రదర్శను ఆహూతులను అలరించింది. చందన , కనకమహాలక్ష్మి గురువులు వెంకట్, తులసీదాసు శిష్య బృందంచే భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది.

అపరాల సాగులో అధిక దిగుబడులు

- రైతుల శిక్షణ తరగతుల్లో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాజ్‌కుమార్

బుచ్చెయ్యపేట: అపరాల సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె. రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొండెంపూడి కేవీకేలో అపరాల సాగు, యాజమాన్యం, అధిక దిగుబడులపై రైతులకు శుక్రవారం ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి అనువైన మినపలో ఎల్‌బీజీ-884, పెసరలో ఐఎంపీ 2-14 రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. భూమిలో విత్తనం నాటక ముందే తగినంత పశువుల ఎరువు, నత్రజని, భాస్వరం వేసుకోవాలన్నారు. ఏడాదిలో మూడు సార్లు సాగు చేయవచ్చన్నారు. 30, 55 రోజుల తర్వాత నీటి తడులు ఇవ్వాలన్నారు. పల్లాకు, ఆకుమచ్చ, తుప్పు తెగులు, బూడిద, కాయనల్లి తదితర తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండి వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మినప, పెసర సాగు చేస్తే ఎకరాకు 600 నుంచి 700 కేజీల వరకు దిగుబడి సాధించవచ్చన్నారు. కంది, గంటి, చోడి, నువ్వులు, వేరుశెనగ తదితర పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. దేవరాపల్లి, చీడికాడ, బుచ్చెయ్యపేట తదితర మండలాలకు చెందిన పలు గ్రామాల రైతులు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు సత్తిబాబు, కిశోర్, సౌజన్య, బాబు, స్రవంతి రైతులకు అపరాల సాగుపై అవగాహన కల్పించారు.

డి.అగ్రహారం శివారులో వృద్ధుడి మృతి

కె.కోటపాడు: మండలంలోని డి.అగ్రహారం శివార్లలో గల మామిడితోటలో విజయనగరం జిల్లా వేపాడ మండలం కుమ్మపల్లి గ్రామానికి చెందిన నర్సింగపల్లి బోమ్మయ్య(80) అనే వృద్ధుడు మృతిచెందాడు. మామిడితోట పరిసరాల్లో తీవ్ర దుర్వాసన రావడంతో అటువైపుగా వెళ్లి చూసిన స్థానికులు.. వృద్ధుడి మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. ఈ సమాచారాన్ని ఎ.కోడూరు పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్‌ఐ బి.రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. డి.అగ్రహారం సమీప గ్రామానికి చెందిన విజయనగరం జిల్లాల్లోని కుమ్మపల్లి గ్రామస్థులు తమ గ్రామానికి చెందిన బోమ్మయ్యగా గుర్తుపట్టారు. భార్య, కుమారుడు చనిపోవడంతో ఇంటి వద్ద బోమ్మయ్య ఒక్కడే ఉంటున్నారు. ఈ నెల 5 వరకూ గ్రామంలో ఉన్న బోమ్మయ్య తరువాత కనిపించలేదని పోలీసులకు తెలిపారు. బోమ్మయ్య సుమారు 5 రోజుల క్రితమే మృతిచెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.పోస్టుమార్టానికి మృతదేహాన్ని అనకాపల్లి తరలించారు.

పూరిల్లు దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గొలుగొండ: గుండిపాల గ్రామంలో గ్యాస్ లీక్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన అన్నదమ్ములు పంపరబోయిన రాజుబాబు, తాతీలు ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం వంటగ్యాస్ లీక్ కావడంతో మంటలు చెలరేగి ఇల్లు కాలిపోయింది. అగ్నిమాకపక సిబ్బంది వచ్చినా ఫలితం లేకపోయింది. ఇద్దరు అన్నదమ్ములకు చెందిన బంగారు, నగదు దగ్ధమవడంతో వారు కన్నీరు మున్నీరయ్యారు. నష్ట పరిహారం అందించి, ఆదుకోవాలని బాధితులు కోరారు. రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం జరిగిందని వారు చెప్పారు.

దసరాకు యోగా థీమ్ పార్కు


థీమ్ పార్కు పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

పీఎంపాలెం: మధురవాడ జోన్-2లో నిర్మిస్తున్న యోగా థీమ్ పార్కులో ప్లాంటేషన్ పూర్తి చేసి దసరా నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బక్కన్నపాలెంలోని స్పోర్ట్స్ థీమ్ పార్కు, ఎంఎస్‌ఆర్ లే అవుట్‌లోని బటర్‌ఫ్లై పార్కులను వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ ప్రాక్టీస్ నెట్, హాఫ్ బాస్కెట్ బాల్, మల్టీ ప్లే గ్రౌండ్ కోర్టులను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఈ క్రమంలో యోగా థీమ్ పార్కు నిర్వహణకు అవకాశం ఇవ్వాలని వాల్‌చంద్‌నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్‌ను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈ పార్కులు ఆయా కాలనీలవాసుల కోసమే అందుబాటులోకి తెస్తున్నామని, వాటిని పక్కాగా నిర్వహిస్తే తప్పకుండా అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కనక మహాలక్ష్మి, ఎస్ఈ శాంసన్ రాజు, డీడీహెచ్ ఎం.దామోదరరావు, ఈఈ శాంతిరాజు, ఏసీపీ శర్మ, అసిసెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో విద్యార్థుల సత్తా

ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.


రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీధర్, క్రీడాకారులు


కశింకోట బాలికల హైస్కూలు విద్యార్థిని వంతల వేదికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన నీరజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

- రాష్ట్రస్థాయి పోటీలకు పలువురి ఎంపిక

అనకాపల్లిటౌన్: విశాఖ ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్ - 17 విభాగంలో మామిడిపాలెం ప్రభుత్వహైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వెయిట్ లిఫ్టింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన పదోతరగతి విద్యార్థి మునగపాక నరేంద్ర, తృతీయస్థానం సాధించిన బొజ్జ లోకేష్, ఫోర్బీస్ ఫెన్సింగ్ క్రీడలో ప్రతిభ చూసిన 9వ తరగతి విద్యార్థినులు కుర్రు జానకీ, కావ్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో శుక్రవారం విద్యార్థులను హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు హెచ్‌బి. శ్రీధర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.గౌరీ, గొంది చిన్నబ్బాయి. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎం.పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలుకి చెందిన వంతల వేదిక వాలీబాల్ పోటీలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. పాడేరులో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఉమ్మడి జిల్లాల స్థాయి పోటీల్లో 14 ఏళ్లలోపు విభాగంలో వేదిక తన ప్రతిభ చూపింది. ఈ మేరకు ప్రశంసా పత్రాన్ని అందించారు. త్వరలో అరకులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వేదిక పాల్గొనుంది . రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వేదికను శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం ఎం.ఎస్. స్వర్ణకుమార్, పీడీ పెంటకోట కమల, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

యలమంచిలి: రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు మండలంలో జంపపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని యల్లపు నీరజ ఎంపికై నట్టు ప్రధానోపాధ్యాయుడు శాస్త్రి శుక్రవారం తెలిపారు. ఇటీవల విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ -17 జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో నీరజ ప్రతిభ కనబరిచినట్టు చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లా జట్టులో రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో ఆడనున్నట్టు తెలిపారు. నీరజను ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

కశింకోట: మండలంలోని తేగాడ సచివాలయంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరగనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు, స్థానిక పీహెచ్‌సీల వైద్యులు, కంటి నిపుణులు రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని తేగాడ సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

నూకాంబికను దర్శించుకున్న రత్నాకర్



నూకాంబిక అమ్మవారి సన్నిధిలో దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారిని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ శుక్రవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. దసరా నవరాత్రుల్లో అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. కొత్త అమావాస్య జాతర సమయానికి పనులు పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్నం అమ్మవారి అన్నసమారాధన కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, పార్టీ నాయకులు దాడి జయవీర్, బొడ్డపాటి చిన్న రాజారావు, ఇంటి తాతారావు, పీఎస్‌కే నాయుడు, సూరిశెట్టి బాల పాల్గొన్నారు.

ఘనంగా కలాం జయంతి



కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైకుంఠరావు

అనకాపల్లిటౌన్: మాజీ రాష్ట్రపతి స్వర్గీయ అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ప్రపంచ విద్యార్థుల దినోత్సవాన్ని నిర్వహించినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు తెలిపారు. అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 844 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,370	4,560
రెండో రకం	3,920	4,350
మూడో రకం	3,800	4,120

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 339 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

అనకాపల్లి సినిమాలు

మ్యాడ్	:రాజా
స్కంద	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
మామా మశ్చీంద్ర	: షిర్డిసాయి
రూల్స్ రంజన్	:పర్తిసాయి
ది ఎక్సార్సిస్ట్: బిలీవర్	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
చంద్రముఖి-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్:జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 64 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-23 యూనిట్లు, బీ పాజిటివ్-18 యూనిట్లు, ఓ పాజిటివ్-18 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

ప్రజలకు రక్ష.. ఆరోగ్య సురక్ష

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష ఆదరణ



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ అధికారి



పాపయ్యసంతపాలెం శిబిరంలో రోగికి కంటి అద్దాలు అందిస్తున్న ఎంపీపీ సూరిబాబు, వైద్యులు

జగనన్న ఆరోగ్య సురక్షకు ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన మందుల్ని అందిస్తుండటంతో ఏ చిన్న సమస్య ఉన్నా శిబిరాలకు జనాలు వస్తున్నారు. వైద్యుల్ని ఆశ్రయించి తమ సమస్యల్ని చెప్పుకుంటున్నారు. డాక్టర్ల భరోసా, అందుకున్న మందులతో ఆనందంగా ఇళ్లకు చేరుకుంటున్నారు.

అనకాపల్లిటౌన్: గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఏ అనారోగ్య సమస్యలు వచ్చినా, పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేదని ప్రస్తుతం జగనన్న పాలనలో గ్రామాల్లోనే ఆధునిక వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని పాపయ్యసంతపాలెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్, 104 అంబులెన్స్ సేవలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారని కొనియాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి 10 రోజులు ముందుగా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్స్, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు చేసి, టోకెన్లు మంజూరు చేశారని, వారితో పాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి కూడా వైద్య సేవలు అందుతున్నాయన్నారు. గ్రామాల్లో మరిన్ని ప్రభుత్వ సేవలు అందాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు.



వైద్య సేవల కోసం నిరీక్షిస్తున్న దివ్యాంగుడు



రోగికి ఈసీజీ పరీక్ష చేస్తున్న సిబ్బంది

ఈ శిబిరానికి పాపయ్యసంతపాలెం, కొండుపాలెం గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి, వైద్య సేవలు పొందారు. నలుగురు స్పెషలిస్టు వైద్యుల ఆధ్వర్యంలో పలు రకాల రక్త పరీక్షలు, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు. గర్భిణుల కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. రైతుల అవగాహనకు ప్రకృతి వ్యవసాయ విభాగం వివిధ రకాల సేంద్రియ ఎరువుల తయారీ, విత్తన శుద్ధి తదితర అంశాలపై స్టాల్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.నరసింహరావు, ఈవోఆర్డీ ధర్మారావు, ఎంఈవో కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ తలారి సత్యనారాయణ, మండల కో అప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, వైద్యులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని జెట్టపురెడ్డితుని సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష ప్రజాదరణ లభించింది. స్థానిక ప్రజలు, పరిశ్రమల్లో పనిచేసే మహిళ కార్మికులు, చిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు ఉత్సాహంగా హాజరై వైద్య సేవలు పొందారు. శిబిరంలో 467 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 112 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 20 మందికి కేటరాక్టు ఆపరేషన్లు, 51 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. హైస్కూల్లో నిర్వహించిన శిబిరాన్ని ఎంపీపీ కలగా లక్ష్మి ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే ఖరీదైన వైద్య సేవలు చేరువ చేశారని కొనియాడారు. శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు రవి తేజ, ఏసు, పీహెచ్‌సీ వైద్యులు యు.రమేష్, యశోద, ఆప్తాలమిక్ అధికారి పవన్ కల్యాణ్ వైద్య సేవలందించారు. స్థానిక జీడి పిక్కల పరిశ్రమ, ఇతర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, చిరుద్యోగులు నిర్వాహకుల ప్రత్యేక అనుమతి తీసుకుని శిబిరానికి హాజరయ్యారు. వైద్య సేవలు వినియోగించుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, సర్పంచ్ కోన అరుణ, పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు కోన వీర వెంకట సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మేరీ జోన్స్, వైద్య ఆరోగ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



జెట్టపురెడ్డితునిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



పౌష్టికాహార ప్రదర్శనలో అంగన్‌వాడీ కార్యకర్తలు



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు



రోగి సమస్యను తెలుసుకుంటున్న డాక్టర్ యశోద



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

తరచూ తలనొప్పి



తరచుగా తలనొప్పి, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నాయి. మా కంపెనీ నిర్వాహకుల అనుమతితో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చా. వైద్య పరీక్షలు జరిపించుకున్నాను. మందులు ఉచితంగా అందించారు. ఆనందంగా ఉంది.

– బి.లక్ష్మి, పరిశ్రమ కార్మికురాలు, నరసింగబిల్లి

కళ్లు మసగ్గా కనిపిస్తున్నాయి



చాలా రోజుల నుంచి కళ్లు మసగ్గా కనిపిస్తున్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు జరిపించుకున్నాను. కళ్లద్దాలు వాడాలన్నారు. ఉచితంగా కళ్లద్దాలు ఇవ్వడానికి సిఫార్సు చేశారు. ఎంతో ఆనందంగా ఉంది.

– బి.నాగమణి, జెట్టపురెడ్డితుని

దగ్గు, కాళ్ల నొప్పులు



దగ్గు, కాళ్ల పీకులు, నొప్పులతో బాధపడుతున్నాను. స్థానిక ఆర్‌ఎంపీ డాక్టర్ల దగ్గర మందులు వాడాను. ఫలితం కనిపించలేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు పరీక్షించారు. ఉచితంగా మందులు అందించారు.

– గేదెల వరలక్ష్మి, నరసింగబిల్లి

బీపీ, సుగర్‌తో బాధపడుతున్నా



బీపీ, సుగర్‌తో బాధపడుతున్నాను. ఏం తినాలన్నా ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సి వస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు సుగర్, బీపీ పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులు ఉచితంగా అందించారు. సంతోషంగా ఉంది.

– కె.మేరేశ్వరరావు, నరసింగబిల్లి

మహిళా రైతు ఉత్పత్తిదారులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏపీఎం జగన్నాథం

కశింకోట: మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి కృషి చేయాలని రైతు ఉత్పత్తిదారుల సంస్థ జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ కె.జగన్నాథం కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం రెండో బ్యాచ్ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళా రైతులు సంఘాలుగా ఏర్పడి దళారుల బెడద లేకుండా తక్కువ ధరకు ఎక్కడ లభిస్తే అక్కడ ఎరువులు కొనుగోలు చేసుకోవాలన్నారు. గిట్టుబాటు అయ్యేలా పంటల అమ్మకాలు చేసుకోవాని సూచించారు. సంఘాల్లో సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు, రాయితీలు అందిస్తారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాలు, అక్కడి సిబ్బంది ద్వారా లభించే సేవల్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. సంఘ పుస్తకాలను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా లీడర్లు అనుసరించాల్సిన బాధ్యతలను వివరించారు. ఎంపీఎం ఎస్.శ్రీనివాసరావు, మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షురాలు ఆడారి పరమేశ్వరి, కార్యదర్శి ముత్తా లక్ష్మి, సీసీలు సత్యనారాయణ, రామకృష్ణ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఊడేరులో ఇంటింటికీ కుళాయిలు



ఇంటింటి కుళాయి పనుల పరిశీలనలో సిబ్బంది

అనకాపల్లి రూరల్: మండలంలోని ఊడేరు గ్రామ శివారు ఒమ్మోడుపాలెంలో ఇంటింటికీ కుళాయి పనులను శుక్రవారం ప్రారంభించారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఊడేరు సచివాలయం పరిధిలోని అల్లిఖానుడుపాలెం, దిబ్బపాలెం, ఊడేరు గ్రామాల్లో రూ.45 లక్షలతో రక్షిత నీటి సరఫరా పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఒమ్మోడుపాలెంలో పైపులైన్ల పనులు పూర్తి కావడంతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులను గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది చేపట్టారు. తాము కలలో కూడా ఊహించని విధంగా తమ ఇళ్లకు కుళాయిలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం పట్ల గ్రామానికి చెందిన మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో జల్ జీవన్ మిషన్ పనులను రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశాలతో త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తెలిపారు.

పాదయాత్ర భవానీ భక్తులకు ఆతిథ్యం



చింతలపాలెం చేరుకున్న పాదయాత్ర భవానీ భక్తుల బృందం

కశింకోట: పాదయాత్రగా విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళుతున్న భవానీ భక్తులకు మండలంలోని చింతలపాలెంలో శుక్రవారం ఆతిథ్యమిచ్చారు. విజయనగరం జిల్లా లక్ష్మీపురం గ్రామం నుంచి విజయవాడకు పాదయాత్రగా బయలుదేరిన ఏడుగురు భవానీ భక్తుల బృందం చింతలపాలెం చేరుకుంది. దీంతో స్థానిక సర్పంచ్ కొట్టి రాము, గురు భవాని జెర్రిపోతుల నూకినాయుడు, తదితరులు స్వాగతం పలికారు. స్థానిక భవానీ భక్తులు వారికి పాదాభివందనాలు చేశారు. మధ్యాహ్నం భిక్ష అందించారు. సాయంత్రం బృందానికి పళ్లు, ఫలహారాలతో వీడ్కోలు పలికారు. స్థానిక గురు భవాని మారిశెట్టి చిరంజీవి, భక్తులు వెంకటసూరిబాబు, నాయుడు, భాస్కర్ పాల్గొన్నారు.

చురుగ్గా దసరా ఉత్సవాల ఏర్పాట్లు



సతకంపట్టు కనకదుర్గ అమ్మవారు



సత్యనారాయణపురం కనకదుర్గ అమ్మవారు

అనకాపల్లిటౌన్: పట్టణ, మండల పరిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలకు పలు దేవాలయాలు, వీధుల్లో చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి 23 వరకూ దసరా ఉత్సవాలకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మవారి ఆలయం, మండలంలోని సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశారు. గౌరీ సేవాసంఘం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 15 నుంచి 19 వరకు రోజూ సాయంత్రం 6 నుంచి నాటక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

కామక్షమ్మ దసరా ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: దసరా నవరాత్రులను పురస్కరించుకుని గవరపాలెం నిదానందొడ్డి శ్రీ కామాక్షమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను పూజా కార్యక్రమాల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి నవరాత్రుల్లో భాగంగా స్థానిక వీవీ రమణ రైతుభారతి హాల్లో ఈ నెల 16, 17 తేదీల్లో సురభి నాటకాలు సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తుర్తి గంగారావు, పట్టణ సంఘం అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు, కార్యదర్శి కొమ్మోజి రాజు, కోశాధికారి పొన్నాడ వెంకట నరసింహాచారి పాల్గొన్నారు.

అమృత్ కలశ యాత్ర



అమృత్ కలశ యాత్రలో ఎంపీపీ, అధికారులు

అనకాపల్లి రూరల్: 'మేరీ మట్టి..మేరీ దేశ్'కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అమృత్ కలశ యాత్రను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి సేకరించిన మట్టిని ఎంపీడీవో కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు పాల్గొన్నారు.

కశింకోట: స్థానికమండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం 'నా మట్టి–నా దేశం' ర్యాలీ నిర్వహించారు. అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గ్రామాల నుంచి సేకరించిన మట్టి పాత్రతో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



అన్నసమారాధన చేస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు

అనకాపల్లిటౌన్: స్థానిక మెయిన్‌రోడ్డు మాసశివరాత్రిని పురస్కరించుకుని శ్రీసిద్ధి లింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సిద్ధి గణపతికి, శ్రీ గోకర్ణేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవికి ఆలయ కమిటీ చైర్మన్ సుదురుపాటి తాతాజీ నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు మల్లిబాబు, రాంబాబుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ దేవాలయాల చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, కర్రి మహాలక్ష్మీనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నేతలు సకలా గోవింద్, గుండా రమేష్ గుప్తా, గొల్లవిల్లి నర్సింగరావు, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సెలవుల్లో స్కూళ్లు తెరిస్తే చర్యలు తీసుకోండి



డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతి పత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ రమణ

అనకాపల్లిటౌన్: సెలవు దినాల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మామిడి రమణ కోరారు. ఈ మేరకు మండలంలోని కేఎస్‌ఆర్ కొత్తూరు డీఈవో కార్యాలయంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు శుక్రవారం వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.గీతాకృష్ణ, కోశాధికారి గొర్ల తరుణ్ పాల్గొన్నారు.

25లోగా బ్యాంకుల్లో సున్నా వడ్డీ లబ్ధిదారుల నమోదు



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామారావు

కశింకోట: సకాలంలో పంట రుణాలు చెల్లించిన రైతులు తమ బ్యాంకు శాఖలను ఈ నెల 25లోగా సంప్రదించి, సున్నా వడ్డీ పంట రుణాల పోర్టల్‌లో డేటా అప్‌లోడ్ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రామారావు సూచించారు. కశింకోట వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో రుణ బకాయిలు చెల్లించిన వారికి నవంబర్‌లో వడ్డి సొమ్ము ప్రభుత్వం చెల్లించనుందన్నారు. రైతు భరోసా కోసం కొత్తగా నమోదు చేసుకునే అర్హులైన రైతులు ఈ నెల 15లోగా సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. దీంతోపాటు ఈ నెల 15లోగా ఈ–పంట నమోదు చేసుకుని, ఈకేవైసీ కూడా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి మాట్లాడుతూ వర్షాభావం వల్ల బయ్యవరం చుట్టు పక్కల ప్రాంతాల్లో వరి నారు ఎండిపోయి, నాట్లు వేయని పంట భూములకు కరవు ప్రాంతంగా ప్రకటించి నష్టపరిహారం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఎస్ పేటకు వెళ్లే మార్గంలో కోతుల బెడద కారణంగా పంటలకు నష్టం కలుగుతోందని, కోతుల నియంత్రణకు చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా మేగజైన్‌ను ఏడీఏ రామారావు ఆవిష్కరించారు. ఏవో ఎం.స్వప్న, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైఎస్సార్ సీపీ పరవాడపాలెం నాయకుడు శివ, మండలి సభ్యులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు



వరి పంటను పరిశీలిస్తున్న ఏటీఎం రామకృష్ణ

అనకాపల్లి రూరల్: వరిలో తెగుళ్ల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని తుమ్మపాల ప్రాంతంలో సాగులో ఉన్న వరి పొలాలను ఆయన పరిశీలించారు. సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. సాంబమసూరీ రకం వరి పంటకు ఎక్కువగా అగ్గి తెగులు వ్యాపిస్తోందన్నారు. దీని నివారణకు లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లజోల్ క్రిమి సంహారక మందును కలిపి, పిచికారీ చేయాలన్నారు. సుడి దోమ ఉధృతి నివారణకు 1.6 మి.టీ. మోనోక్రోటోఫాస్ లేదా 2 గ్రాముల ఎసిపేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తమ సేవలను రైతులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.